## క్లుప్తంగా

### అధ్యాపకులకు అభినందన

**అగనంపూడి:** పరిశోధన, ఉత్తమ విద్యా బోధన వంటి అంశాల్లో కాపుజగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు అధ్యాపకులకు జాతీయ స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డులు దక్కించుకున్నారు. కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీ ఆఫ్ ఇండియా (సీఎస్‌సీ) 2025 సంవత్సరానికి జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రకటించింది. వీరిలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బుద్దా హరికుమార్‌కు బోధనా రంగంలో, ప్రొఫెసర్ లక్ష్మి లిడియాకు పరిశోధనా రంగంలో ప్రతిభకనపర్చినందుకు, అసిస్టెంట్ ప్రొఫెసర్ శశికాంత్ బేతా విద్యార్థులతో మమేకమైనందుకు అవార్డులు వరించినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డులు దక్కించుకున్న అధ్యాపకులను కళాశాలయాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

### ఘనంగా హిందీ దినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

**గాజువాక:** స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో హిందీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు మాట్లాడుతూ దేశ రాజభాష హిందీ అని, అది సరళంగా, సహజంగా ఉంటుందని అన్నారు. పలువురు హిందీ కవుల కలం నుంచి వెలువడిన సాహిత్య విశేషాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ హిందీ ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి టి.ఎల్లేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.తేజేశ్వరరావు, హిందీ అధ్యాపకురాలు కె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలిగా సత్యవతి

**అగనంపూడి:** అగంపూడి బీసీ కాలనీకి చెందిన గంతకోరు సత్యవతిని గాజువాక నియోజకవర్గ టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలిగా నియమించినట్టు నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

**మద్దిలపాలెం :** ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్రం, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రటిక్ ఎంగేజ్మెంట్ అండ్ అకౌంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించనున్న అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. సెప్టెంబర్ 15ని అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పొలిటికల్ సైన్స్ విభాగంలో కార్యక్రమం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ రాజ్యసభ సభ్యుడు, విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షుడు పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం, డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య జి.ఎం.జె.రాజు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఇగ్నోలో 15 వరకు స్వచ్ఛతా పక్షోత్సవాలు

**ఎంవీపీ కాలనీ :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా స్వచ్ఛతా పక్షోత్సవాలను ఇగ్నో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 15 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ విశాఖ ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం ఇగ్నో విశాఖ అధికారులు, సిబ్బంది స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యాలయం పరిసరాలను శుభ్రపరచడంతోపాటు దత్తత గ్రామం అయ్యన్నపాలెంలో విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేయించడంతోపాటు పరిసరాలను శుభ్రం చేశారు.

# ఆడబిడ్డ నిధి ఎక్కడ?



**సూపర్ సిక్స్ అమలు చేశామని కూటమి నాయకులు ఊదరగొడుతున్నారు. అయితే సూపర్ సిక్స్‌లో ఉన్న మరో పథకం ఆడబిడ్డ నిధి.. అదే మహాశక్తి పథకం ఇంకా అమలు చేయలేదని కూటమి నాయకులు మరిచిపోయారా అని మహిళా లోకం ప్రశ్నిస్తోంది. అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా ఇంత వరకూ ఆడబిడ్డనిధి కోసం స్పందించలేదని నిలదీస్తోంది.**

- అమలు కాని మహాశక్తి పథకం
- ఎదురు చూస్తున్న నారీ లోకం
- గాజువాక నియోజకవర్గంలో 90 వేల మంది వరకు అర్హులు

**పెదగంట్యాడ:** ఎన్నికల ముందుకు కూటమి నాయకులు మహిళలకు ప్రతి నెలా రూ.1500 వంతున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఆ పథకం ఊసెత్తడం లేదు. ఎన్నికల ముందు కూటమి పెద్దలు ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో మహిళలంతా మండిపడుతున్నారు.

**గత ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందేవి. మహిళలకు ఆర్థిక చేయూత నందించేందుకు వారి ఖాతాలోనే డబ్బులు జమ చేసింది. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత వంటి ముఖ్యమైన పథకాలు అమలు చేస్తూ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించి వారి స్వయం ఉపాధికి బాటలు వేసింది. కూటకి ప్రభుత్వం 19 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 వంతున ఏడాదికి రూ.18వేలు చెల్లించాల్సి ఉంది. అయితే మహిళలు ఆడబిడ్డ నిధిని ఎప్పుడు అమలు చేస్తారో తెలియక అయోమయంలో ఉన్నారు.




చంద్రబాబు ఎన్నికల్లో ప్రకటించిన పథకం పోస్టర్

**ప్రచారంలోనేనా!**

కుటుంబంలో మహిళలే మహరాణులు.. మహిళలు ఆర్థికంగా ఎదిగితే ఆ కుటుంబం బాగుంటుందని.. అలాగే సమాజం అభివృద్ధి చెందుతుందని కూటమి నాయకులు ప్రకటనలు గుప్పించారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి ఆడబిడ్డ నిధి అమలు చేస్తామని ఎన్నికల ముందు ప్రకటించారు. ఆ దిశగా అడుగులు పడుతున్న దాఖలాలు కనిపించక పోవడంతో మహిళలు రగిలిపోతున్నారు.

**ఎదురు చూపులు**

గాజువాక నియోజకవర్గంలో పరిధిలో 19 నుంచి 59 ఏళ్లలోపు వారు సుమారు 90 వేల మంది ఉంటారని అంచనా. వీరికి ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 చెప్పున ఏడాదికి రూ. 18వేలు చెల్లించాల్సి ఉంది. అంటే ఇప్పటికే లబ్ధిదారులకు కోట్లలో బకాయిలు చెల్లించాల్సి ఉంది. అనంతపురంలో నిర్వహించిన విజయోత్సవంలో ఆడబిడ్డ నిధిపై ప్రకటన చేస్తారని అక్కచెల్లెమ్మలు ఆశగా ఎదురు చూశారు. అయితే ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో నిరాశే మిగిల్చారని వారు వాపోతున్నారు.

**ఏడాది దాటినా..**



ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇంతవరకూ ఆ పథకాన్ని అమలు చేయలేదు. ఈ పథకం అమలై ఉంటే మహిళలకు రూ.18 వేలకు పైగా డబ్బులు జమయ్యేవి. ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలి. మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందించాలి.

– సీహెచ్ అన్నపూర్ణ, పెదగంట్యాడ.

**వెంటనే ఇవ్వాలి**



మహిళలకు ఆర్థికంగా చేయూత ఇస్తామని ఎన్నికల ముందు చెప్పిన కూటమి నాయకులు ఆ పథకాన్ని వెంటనే అమలు చేయాలి. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.1500 జమ చేయాలి. అలాగే గడచిన నెలలకు కూడా కలిపి ఇవ్వాలి. ఆర్థికంగా ఆదుకుంటారనే నమ్మకంతో ఓట్లు వేశాం. వెంటనే ఆడబిడ్డ నిధి ఇవ్వాలి.

– గొందేశి చిలకమ్మ, నెల్లిముక్కు.

**ఎదురు చూపులేనా..**



ఆడబిడ్డ నిధి కోసం ఎదురు చూస్తున్నాం. ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలి. మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందించాలి. మహిళల ఖాతాలో డబ్బులు జమ చేస్తే కుటుంబాలను ఆదుకున్నట్టు అవుతుంది. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆడబిడ్డ నిధులు విడుదల చేసి అర్హత ఉన్న ప్రతి మహిళకు అందించాలి.

– బి పద్మ, ఇస్లాంపేట

# కార్మికుల ఆకలి కేకలు వినపడడం లేదా?



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఉరుకూటి చందు

- వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చందు
- కార్మికుల పోరాటానికి సంఘీభావం

**అగనంపూడి:** జీతాల బకాయిల కోసం కార్మికులు నిరవధిక సమ్మె చేస్తుంటే యాజమాన్యం పట్టనట్టు వ్యవహరించడం.., వారికి అధికారులు అండగా నిలవడం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉరుకూటి చందు అన్నారు. దువ్వాడ వీఎస్ఈజెడ్‌లోని సినర్జీస్ కార్మికులు బకాయి పడిన జీతాలు చెల్లించాలని పది రోజుల నుంచి సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన కార్మికులకు సంఘీభావం తెలిపారు. అనంతరం చందు మాట్లాడుతూ యాజమాన్యం తన వైఖరి మార్చుకొని బకాయిలు చెల్లించడానికి ముందుకురావాలని డిమాండ్ చేశారు. ఏడాది పనిచేయించుకొని సగం జీతం చెల్లించడం వెట్టి చాకిరీ అవుతుందని, కార్మిక చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. అధికారులు ఈవిషయంలో ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మికులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నైపుణ్యాల ప్రదర్శనకు చక్కటి వేదిక టెక్‌ఫెస్ట్



స్వాగత గీతానికి భరతనాట్యం చేస్తున్న విద్యార్థిని




ఫెస్ట్‌లో ప్రదర్శించిన నమూనాలను తిలకిస్తున్న అతిథి శ్రీధర్‌సింగ్

**బీడీఎల్ జీఎం శ్రీధర్ సింగ్**

**అగనంపూడి:** టెక్నికల్ ఫెస్ట్ అనేది విద్యార్థుల్లో కొత్త ఆలోచనలకు, వారిలో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభాపాటవాల ప్రదర్శనకు చక్కటి వేదికగా నిలుస్తుందని బీడీఎల్ జీఎం శ్రీధర్‌సింగ్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ కళాశాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సస్టైనబుల్ సినర్జీ–ఇండస్ట్రీ 4.0 పేరుతో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టెక్ ఫెస్ట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు, నూతన ధోరణులు, నవ్య ప్రాజెక్టుల ప్రదర్శనతో నైపుణ్యాభివృద్ధికి పదును పెట్టాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ విద్యార్థుల సాంకేతిక పురోగతి, అన్వేషణలను అంచనా వేసుకోడానికి కార్యక్రమం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విద్యార్థుల ఆలోచనలను వేలాదిమంది ముందు ప్రదర్శించి వారి శక్తియుక్తులను బహిర్గతం చేసుకోడానికి ఫెస్ట్ ఉపయోగపడుతుందనే లక్ష్యంతో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 50 ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. హ్యాక్‌థాన్, ఐడియాథాన్, యాప్ డిజైనింగ్, సర్క్యూట్రిక్స్, రోబో రేస్, డ్రోన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు, టెక్నికల్ క్విజ్, బిజినెస్ ఐడియాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కన్వీనర్ క్రాంతికుమార్, డీన్లు, వివిధ విభాగాల హెడ్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# స్థానికేతరులకు ఉపాధిపై స్పందించాలి

**కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్**



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబీకులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్‌లో పని చేయడానికి స్థానికులను కాదని స్థానికేతరులను చేర్చుకోవడంపై విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పందించాలని తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులు కోరారు. రాష్ట్రేతర కార్మికులను చేర్చుకోవడానికి నిరసనగా ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు శనివారం ఉక్కు ట్రైనింగ్ విభాగం వద్ద ధర్నా చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొంత మంది తమ కుటుంబీకులతో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల భార్యలు తమ భర్తలను తొలగించడానికి కారణం చెప్పాలని డిమాండ్ చేశారు. వారికి పని లేకపోతే ఇతర రాష్ట్రాల వారికి పని ఎలా దొరకుతుందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎంపీలు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధానకార్యదర్శి నమ్మి రమణ, నిర్వాసిత యూనియన్ నాయకులు భాస్కరరావు, ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ, కోన రమణ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 540 కేసుల పరిష్కారం



బాధితునికి పరిహారం చెక్కు అందజేస్తున్న న్యాయమూర్తులు

**గాజువాక:** గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో రూ.4.66 లక్షల విలువైన 540 కేసులను న్యాయమూర్తులు రాజీ మార్గంలో పరిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని 13వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.షణ్ముఖరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ఉత్తమమైన మార్గమని అన్నారు. దీని వల్ల కక్షిదారుల మధ్య సత్సంబంధాలు ఉంటాయన్నారు. రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం వల్ల లభించే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం నాలుగు బెంచ్‌ల ద్వారా న్యాయమూర్తులు కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.వెంకట శేషమ్మ, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి.యశోధర వేదమణి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



68వ వార్డులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా, కార్పొరేటర్ అనూష

**గాజువాక:** జీవీఎంసీ 68వ వార్డులో రూ.1.62 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాక పరిధిలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష మాట్లాడుతూ ఈ నిధులతో రామ్‌నగర్ వాటర్ బాడీ వద్ద వాకింగ్ ట్రాక్, ఆర్‌సీసీ బెంచిలు, మింది రైల్వే ట్రాక్ సమీపంలో వీఆర్‌సీసీ డ్రెయిన్, మింది ప్రాథమిక పాఠశాలవద్ద సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టు, మింది పెద్ద చెరువువద్ద మోడల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. వార్డులో మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

**65,75 వార్డుల పరిధిలో..**

**పెదగంట్యాడ:** జీవీఎంసీ, 65, 75వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. 65వ వార్డు పరిధిలోని వికాస్‌నగర్ కూడలి నుంచి రాజీవ్ మార్గ్ సత్తెమ్మతల్లి ఆలయం వరకూ రోడ్డు విస్తరణ, 75వ వార్డులో రోడ్లు, కాలువలు, పార్కులో ఓపెన్ జిమ్‌ల పనుల కోసం వార్డు కార్పొరేటర్లు పులి ఝాన్సీ లక్ష్మీబాయి, బొడ్డు నరసింహపాత్రుడుతో కలసి శంకుస్థాపన చేశారు. పెదగంట్యాడ పీహెచ్‌సీ ఆవరణలో నిర్మించిన అదనపు భవనాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్‌తో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో జోన్–6 జోనల్ కమిషనర్ శేషాద్రి, వైద్యాధికారులు డాక్టర్ సంపత్‌బాబు, డాక్టర్ హేమలత, ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

## పాలస్తీనాకు సంఘీభావంగా ర్యాలీ

**ఏయూ క్యాంపస్ :** ఇజ్రాయిల్ దురాక్రమణను నిరశిస్తూ గ్లోబల్ సముద్ పోటిల్లాకు మద్దతుగా ఇండియన్ పీపుల్ ఇన్ సోలిడారిటీ విత్ పాలస్తీనా ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బీచ్‌రోడ్డులో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సుజన్ మాట్లాడుతూ గత 23 నెలలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో 65 వేల మంది వరకు ప్రజలు చనిపోయారని, వారిలో 20 వేల మంది చిన్నారులే ఉన్నారన్నారు. మానవత్వంలేని ఇటువంటి దుశ్చర్యలను ఖండిచాలని కోరారు. ప్రజలకు ఆహారం, మందులు అందించడానికి వెళ్తున్న నౌకా బృందంపై రెండు సార్లు ఇజ్రాయిల్ డ్రోన్‌లతో దాడులు చేసిందన్నారు. ప్రజలంతా సంఘటితంగా ఇటువంటి దుశ్చర్యలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. గ్లోబల్ సముద్ పోటిల్లాకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

# గుంతలమయంగా ఉక్కు రహదారులు

**అవస్థలు పడుతున్న ఉద్యోగులు**



స్టీల్‌ప్లాంట్ పైలాన్ పక్క రహదారిలో గతుకులు



ఉక్కునగరం కూడలి వద్ద రహదారిలో గుంత

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్‌కు చెందిన పలు రహదారులు గుంతలమయంగా మారాయి. దీంతో ఉద్యోగులు విధులకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో స్టీల్‌ప్లాంట్ రహదారులు ఎయిర్‌పోర్ట్ రన్‌వేలా ఉండేవి. ప్రతీ రెండేళ్లకు ఒకసారి వాటికి మరమ్మతులు చేస్తూ డివైడర్ కింద అంచుల వరకు రోడ్లు పెరుగుతూ ఉండేవి. ఇటీవల కాలంలో రోడ్లు మరమ్మతులు చేయకపోవడంతో కూర్మన్నపాలెం నుంచి ప్లాంట్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో అనేక చోట్ల గతుకులమయంగా మారింది. పైలాన్ కూడలి, ఐఎన్‌టీయూసీ కార్యాలయం కూడలి, శ్రీచైతన్య జూనియర్ కళాశాల దగ్గర, ఉక్కునగరంలోని అనేక రహదారులు అధ్వానంగా ఉన్నాయి. నైట్‌షిఫ్ట్‌కు వెళ్లే ఉద్యోగులు ఈ రహదారుల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఉక్కు యాజమాన్యం స్పందించి రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

# శరన్నవరాత్రి ఉత్సవాలకు ముహూర్తపురాట



ముహూర్తపు రాట వేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు



కణితిలో రాట వేస్తున్న ఉత్సవకమిటీ సభ్యులు, నాయకులు

**కూర్మన్నపాలెం:** శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. దీనిలో భాగంగా శనివారం 87వ వార్డులోని పలు చోట్ల ఉత్సవరాట వేశారు. రజకవీధిలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడశ్రీను, బొడ్డ గోవింద్, దానప్పలు, దామోదర్, సారిపల్లి గణపతి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కణితిలో జరిగిన ముహూర్తపు రాట కార్యక్రమానికి నాయకులు ఇల్లపురాము, ప్రగడవేణు, వెంకటరావు, నూకరాజు,సన్యాసిరావు అప్పారావు తదితరులు హాజరై రాటను శాస్త్రోక్తంగా వేశారు.

# హోం గార్డ్ కుటుంబానికి కార్పొరేటర్ పూర్ణిమ ఆసరా



బాధితుని భార్యకు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

**కంచరపాలెం:** గాజువాక ప్రాంతానికి చెందిన హోంగార్డు లక్ష్మణరావు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న 41వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ తక్షణం స్పందించారు. లక్ష్మణరావు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేల నగదును బాధితుని భార్యకు అందించడమే కాకుండా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. లక్ష్మణరావు పూర్తిస్థాయిలో కోలుకోవాలని పూర్ణిమ ఆకాంక్షించారు. శనివారం కంచరపాలెం ఐదవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సమక్షంలో లక్ష్మణరావు భార్యకు కార్పొరేటర్ పూర్ణిమ నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ వింగ్ రాష్ట్ర నాయకుడు వేళంగిణీ రావు, ఎస్ఐ భాస్కరరావు, సీనియర్ నాయకులు పాత్రపల్లి సునీల్‌కుమార్, దాలిబాన మధు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దని ఆందోళన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

**బీచ్‌రోడ్డు:** విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, విభజన చట్టంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆదివారం విశాఖలో పర్యటిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎ.విమల, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె. రహిమాన్ తదితరులు మాట్లాడారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేయడం లేదని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఇంకో పక్క ఉక్కులో 43 విభాగాలను ఒక్కొక్కటిగా ప్రైవేట్‌పరం చేయడం వెనుక గల మతలబు ఏమిటో చెప్పాలన్నారు. విశాఖకు ఏం చేశారని ఇక్కడ సభ పెట్టారని ప్రశ్నించారు. జె.పి. నడ్డా విశాఖ పర్యటనలో ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కును ప్రైవేట్ పరం చేస్తే కూటమి ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజల్లో చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు.